సాక్షి
మహబూబ్‌నగర్



జగజ్జననీ.. సదాస్మరామి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడ వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ఉమాదేవిగా దర్శనమిచ్చారు.

వివరాలు 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.4 /21.8

వాతావరణం

ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతి విగ్రహానికి జియో ట్యాగింగ్: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే దుర్గామాత మండపాల నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనలు పాటించాలని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 269 విగ్రహాలు ఏర్పాటు చేశారని, మండప నిర్వాహకులు ఆయా పోలీస్‌స్టేషన్ నుంచి తప్పక అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాలను రోడ్డు పక్కనే కానీ, ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని, స్టేజీ కింద ఎలాంటి అవాంఛనీయ వస్తువులు పెట్టరాదని తెలిపారు. మండపాల దగ్గర సత్ప్రవర్తన కలిగిన వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని, వివాదాస్పద ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్పీకర్లు తగిన సౌండ్‌లో పెట్టుకోవాలని తెలిపారు. దుర్గా మాత విగ్రహాలకు జియో ట్యాగింగ్ ద్వారా గూగుల్ మ్యాప్‌లకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి చిన్నపాటి ఘటన జరిగినా డయల్ 100 లేదా, సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, ప్రతి మండపం దగ్గర తప్పకుండా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేయాలని సూచించారు.

నవంబర్ 2 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని, ప్రశాంత వాతావరణం పెంపొందించడానికి గురువారం నుంచి నవంబర్ 2 వరకు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ అమల్లో ఉన్న రోజుల్లో డీఎస్పీ లేదా ఇతర పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాలులో సమావేశాలు ఏర్పాటు చేయరాదని పేర్కొన్నారు. కత్తులు, తుపాకులు, జెండా కర్రలు, పేలుడు పదార్థాలు నేరాలకు ఉపయోగించే ఎలాంటి ఆయుధాలు వాడరాదని సూచించారు. లౌడ్‌స్పీకర్లు, డీజేలు వంటివి ఈ సమయాల్లో నిషేధం అని, సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ నియమాలు ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులని తెలిపారు.

న్యాయవాదులపై దాడులు ఆపాలి



పాలమూరు: రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు కొనసాగుతున్నాయని, వీటిని అడ్డుకోవడానికి అందరూ ఏకతాటిపై ఉండాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో పనిచేసే న్యాయవాది అబ్దుల్ హలీంపై మాదన్నపేట పోలీసులు విచక్షణరహితంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కోర్టులో విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదిని దూషించి, రోడ్డుపై దాడిచేసుకుంటూ తీసుకెళ్లడం సరికాదన్నారు. నిరవధిక న్యాయవాదుల పోరాట కార్యక్రమాలకు బార్ కౌన్సిల్ సభ్యులు ఎవరూ సహకరించడం లేదన్నారు. హక్కులు పరిష్కరించుకోవాలంటే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. ఈనెల చివరి వారం నుంచి న్యాయవాదుల సమస్యలపై నిరవధిక పోరాట కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై సీఎం దృష్టికి తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు తరలిన క్రీడాకారులు



మహబూబ్‌నగర్ క్రీడలు: సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువులో నేటి నుంచి ఈనెల 5 వరకు జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు గురువారం తరలివెళ్లినట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సాయికుమార్, కోశాధికారి యూ.సురేష్ తెలిపారు. సబ్ జూనియర్‌లో 10, జూనియర్ విభాగంలో 11 మంది బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటి పతకలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

23,22,054

ఉమ్మడి పాలమూరులో గ్రామీణ ఓటర్లు

- పంచాయతీ ఎన్నికలకు తుది ఓటరు జాబితా సిద్ధం చేసిన ఎన్నికల సంఘం
- 15,276 వార్డుల వారీగా సిద్ధమైన తుది జాబితా
- నాగర్‌కర్నూల్ మినహా మిగతా 4 జిల్లాల్లో మహిళలే అధికం
- స్థానిక పోరుకు యంత్రాంగం సన్నద్ధం



సాక్షి, నాగర్‌కర్నూల్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తులో భాగంగా ఓటరు తుది జాబితాను ప్రచురించింది. ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో 71 మండలాల పరిధిలోని 1,700 పంచాయతీల్లో 15,276 వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23,22,054 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 11,67,893 మంది, పురుషులు 11,54,128 మంది, ఇతరులు 33 మంది ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మినహా మిగతా జిల్లాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉంది. కాగా.. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్‌లో అత్యధికంగా 6,46,407 మంది ఓటర్లు ఉండగా.. వనపర్తి జిల్లాలో తక్కువగా 3,67,521 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీలు, వార్డులు కూడా నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలకు కీలకమైన ఓటరు జాబితా సిద్ధం కావడంతో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ సారి మూడు విడతలుగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

రిజర్వేషన్లపైనే ఆసక్తి..

ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. సుమారు తొమ్మిది నెలలుగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుండగా, అందుకనుగుణంగా అధికార యంత్రాంగం కసరత్తును ప్రారంభించింది. ఓటర్ల తుది జాబితా సైతం పూర్తికావడంతో ఇప్పుడు అందరి దృష్టి రిజర్వేషన్లపై పడింది. గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ఈసారి కులగణన పూర్తయ్యాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కులగణనను ఎప్పటినుంచి చేపడతారన్న దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామీణ ఓటర్ల వివరాలు..

జిల్లా	మండలాలు	జీపీలు	వార్డులు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	14	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183
నాగర్‌కర్నూల్	20	464	4,140	3,23,705	3,22,689	13	6,46,407
వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	4	3,67,521
జోగుళాంబ గద్వాల	12	255	2,390	1,91,313	1,96,875	7	3,88,195
నారాయణపేట	11	280	2,544	1,98,199	2,05,547	2	4,03,748

అక్రమ దందాల్లో ఖాకీలు



సీరియస్‌గా తీసుకున్న పోలీస్ శాఖ

- ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐలపై వేటు
- ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు
- వీఆర్‌కు అటాచ్ చేస్తూ డీఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు
- మరికొందరు పోలీసు అధికారులపై నిఘా

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా కట్టడిలో నిర్లక్ష్యం వహిస్తూ.. లోపాయికారీగా దందాను ప్రోత్సహిస్తున్న పలువురు ఎస్‌ఐపై పోలీస్ శాఖ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ఐదుగురు ఎస్‌ఐలను వీఆర్‌కు అటాచ్ చేస్తూ గురువారం మల్టీ జోన్- 2 డీఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో వనపర్తి జిల్లా వీపనగండ్ల, నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్‌ఐలను వీఆర్‌కు అటాచ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన ఖాకీలే అక్రమార్కులతో అంటకాగుతూ ప్రోత్సహిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలకు పూనుకోవడంతో సదరు పోలీస్ అధికారుల్లో గుబులు రేపుతోంది.

వారి తీరుతో అప్రతిష్ట

పోలీస్‌శాఖలోని కొంతమంది అధికారుల తీరు ఆ శాఖను అప్రతిష్టపాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని కొంతమంది సీఐ, ఎస్‌ఐలు అక్రమ దందాల్లో పాలుపంచుకుని అందినకాడికి దండుకుంటున్నారు. వీరి పనితీరుపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, ఫిర్యాదులు వస్తున్నా ఉన్నతాధికారుల నుంచి స్పందన కొరవడటంతో ఇన్నాళ్లుగా వీరి ఆగడాలు సాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభీ వాగు పరిసర మండలాలు, గ్రామాల్లో జోరుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా దందాకు పలువురు పోలీస్ అధికారులు అండగా నిలుస్తున్నారు. నెలనెలా పెద్దఎత్తున మాముళ్లు దండుకుంటూ ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల ఆదాయం దక్కకుండాపోతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి, ఉల్పర, చింతపల్లి తదితర గ్రామాల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలతో ఎస్‌ఐ లెనిన్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వంగూరు మండలం నుంచి ప్రభుత్వ పనుల పేరుతో పెద్దఎత్తున ఇసుకను తరలించి.. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి ఎస్‌ఐ మహేందర్‌ను వీఆర్‌కు అటాచ్ చేస్తూ చర్యలు చేపట్టారు. తెలకపల్లి మండలంలోని నడిగడ్డ, తాళ్లపల్లి, గౌరారం గ్రామాల్లో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా సాగుతుండగా కట్టడిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ నరేశ్‌పై వేటు వేసింది. బిజినేపల్లి మండలంలో పనిచేస్తున్న ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తీరు తరచుగా వివాదాస్పదంగా మారింది. కుక్క కారణంగా జరిగిన చిన్న గొడవ విషయంలో వెల్గొండకు చెందిన ఓ వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి చేయి చేసుకున్నాడన్న కారణంతో ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పేకాట రాయుళ్ల నుంచి వసూళ్లకు పాల్పడటం, కోడి పందేల నిర్వాహకుల నుంచి పెద్దఎత్తున డబ్బులు దండుకోవడం వంటి అక్రమ దందాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని తూంకుంట, కొండూరు వాగుల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలతో వీపనగండ్ల, చిన్నంబావి ఎస్‌ఐలపై వేటుపడింది.

ఇప్పటికే ఇద్దరు బదిలీ..

ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టినట్టు వెల్లడించారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇవే ఆరోపణలతో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, వనపర్తి జిల్లా చిన్నంబావి పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలను ఇప్పటికే బదిలీ చేశామని తెలిపారు. పర్యావరణానికి నష్టం కలిగించేలా నదులు, వాగుల్లో విచక్షణారహితంగా సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, దీనిపై ఆయా జిల్లాల ఎస్పీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు.

ఫిర్యాదుల నేపథ్యంలో..

పోలీస్ శాఖలో కొంతమంది అధికారులు అక్రమ దందాలకు సహకరిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీస్ నిఘా వర్గాల ద్వారా సదరు అధికారుల తీరుపై నిఘా ఉంచి విచారణ చేపట్టింది. విచారణలో అక్రమాలు నిగ్గు తేలాక సదరు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ఇసుక అక్రమ రవాణా, అక్రమ రేషన్ బియ్యం దందా, కోడిపందేలు, పేకాట రాయుళ్ల నుంచి వసూళ్లు, అక్రమ దందాలను ప్రోత్సహించడం, విచ్చలవిడిగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పోలీస్ అధికారులపై నిఘా పెంచినట్టు తెలుస్తోంది. ఫిర్యాదులు వస్తున్న పోలీస్ అధికారులపై ఆయా జిల్లాల ఎస్పీల ఆధ్వర్యంలో విచారణ చేపట్టి, చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

ఎఫ్‌డీసీ సర్వే ప్రారంభం



జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

- తొలిరోజు పరిశీలించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్
- గడువులోగా ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలని ఆదేశం

జడ్చర్ల టౌన్/హన్వాడ/భూత్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ) సర్వే గురువారం ప్రారంభమైంది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన హన్వాడ మండలం మాదారం, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 37వ వార్డు, జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లి, జడ్చర్ల పురపాలికలో 24వ వార్డు, చిన్నచింతకుంట మండలం సీతారాంపేట, భూత్పూరు మున్సిపాలిటీలో 9వ వార్డుల్లో సర్వే చేపట్టారు. ఐదురోజుల్లో ఈ సర్వే పూర్తి చేయాల్సి ఉండగా.. అదనపు కలెక్టర్లు, ఆర్డీఓల, జెడ్పీ సీఈఓలు పర్యవేక్షించగా..మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జెడ్పీ సీఈఓల ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి అల్వాన్‌పల్లి, జడ్చర్ల, భూత్పూర్‌లో సర్వేను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని సర్వే నిర్వహించాలని, మహిళలను హెడ్ ఆఫ్‌ది ఫ్యామిలీగా ఎంపిక చేయాలన్నారు. కుటుంబంలో ఆధార్‌కార్డు ఆధారంగా వయసు సరిచేయాలని, పెళ్లయిన ఆడపిల్లలుంటే వారి కుటుంబం నుంచి తొలగించాలని, ఇంట్లో ఎవరిపేరు లేకున్నా.. వారిని కలపాలన్నారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలన్నారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ విజయేందిర హన్వాడ మండలం మాదారంలో సర్వేను పరిశీలించారు. ప్రజలు కుటుంబ సర్వేను సహకరించి..వారి వివరాలను సర్వే బృందాలకు అందజేయాలని ఆమె సూచించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 37వ వార్డులోని సద్దలగుండు, రాజేంద్రనగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సర్వేను ప్రారంభించగా.. సీతారాంపేట సర్వేను భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ రాంరెడ్డి పరిశీలించారు. ఆయా సర్వేల్లో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు మహేశ్వర్‌రెడ్డి, రాజయ్య, సరేందర్‌రెడ్డి, తహసీల్దార్లు,ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

సన్నా, దొడ్డు రకం ధాన్యం వేర్వేరుగా సేకరించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర, ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వానాకాలం 2024–25 ధాన్యం సేకరణ, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, నియామకం ఆర్డర్ల జారీ అంశాలపై రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా అధికారులతో వీసీ నిర్వహించారు. వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నందున, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకురాకుండా రాష్ట్ర సరిహద్దుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్సీకి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వీసీలో కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు పాల్గొన్నారు.

217 మంది ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీఎస్సీ–2024కు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో కొనసాగింది. మొత్తం 12 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా.. ప్రతి కేంద్రంలోనూ ఇద్దరు గజిటెడ్ ఉపాధ్యాయులు, ఒక జూనియర్ అసిస్టెంట్‌లను నియమించారు. ఈ మేరకు ఎస్‌ఏ తెలుగు–16 మంది, ఎస్‌ఏ హిందీ 8 మంది, ఎస్‌ఏ సోషల్ 16 మంది, ఎస్‌ఏ మ్యాథ్స్ 16 మంది, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ 12 మంది, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇద్దరు, పీఈటీ 8 మంది, మిగతా ఎస్జీటీలతో కలిపి మొత్తం 217 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. అందులో ఇద్దరిపై కోర్టు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఒకటి చీటింగ్ కేసు, మరొకటి టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. వాటికి సంబంధించిన వెరిఫికేషన్‌ను నిలిపి వేసినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని.. వాటికి కూడా వెరిఫికేషన్‌ను యథావిధిగా నిర్వహించి ప్రభుత్వానికి పంపిస్తామని డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు.



డైట్ కళాశాల వెరిఫికేషన్ కేంద్రంలో అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయలక్ష్మి

■ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాల్లో ఆర్జేడీ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్‌కు వచ్చిన అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. డిగ్రీ, బీఈడీ పూర్తయిన అభ్యర్థులు సంబంధిత యూనివర్సిటీల నుంచి కాన్వొకేషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలని సూచించారు. సకాలంలో వెరిఫికేషన్ పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ వెంట బాలుయాదవ్, సూపరింటెండెంట్ శంభుప్రసాద్ ఉన్నారు.

'కురుమూర్తి స్వామి' పాలకవర్గం ఏర్పాటు



చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరులో ప్రసిద్ధిగాంచిన కురుమూర్తిస్వామి ఆలయ నూతన పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు 14 మంది సభ్యులతో కమిటీని నియమించేందుకు దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా గౌని గోవర్ధన్‌రెడ్డి, ఎ.భారతి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శేఖర్, భాస్కర్, నాగరాజు, రాఘవేంద్ర, కమలాకర్, గౌని రాము, వన్నాడ గోపాల్, చక్రవర్ధన్‌రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, ఎం.రాములు పేరుతో జాబితా రూపొందించగా.. గౌని గోవర్ధన్‌రెడ్డికి చైర్మన్ పదవి ఖరారు అయినట్లు తెలుస్తుంది. త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

బాదేపల్లి మార్కెట్ చైర్‌పర్సన్‌గా తంగెళ్ల జ్యోతి



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలక మండలి ఖరారైంది. గురువారం ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్‌గా మిడ్జిల్‌కు చెందిన తంగెళ్ల జ్యోతిని నియమించగా, వైస్ చైర్మన్‌గా రాజేందర్‌గౌడ్, సభ్యులుగా వనం కృష్ణయ్య, ముడావత్ రాజునాయక్, కుర్మిద్దె యాకూబ్, సి.లక్ష్మయ్య, ఎండీ ఖాజా అలీముద్దీన్, బొల్లం సత్యనారాయణ గౌడ్, నల్ల నారాయణరెడ్డి, కొంగలి యాదయ్య, ద్యాప శ్రీనివాస్‌రెడ్డి, మొగ్గాల బంగారయ్య, సంక్లా సునీల్, శివ్వ కిషోర్‌కుమార్‌లను నియమించారు. ఈ నెల 9న బాదేపల్లి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు



జెండా ఊపి ఎంపికలను ప్రారంభిస్తున్న వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ అన్నారు. వరంగల్‌లో ఈనెల 7, 8 తేదీల్లో జరిగే 10వ రాష్ట్రస్థాయి (అండర్–14, 16, 18, 20 ఏళ్లలోపు) అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను గురువారం జిల్లాకేంద్రంలో మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి ఎంపికలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరతచంద్ర మాట్లాడుతూ ఎంపికలకు జిల్లావ్యాప్తంగా దాదాపు 100 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. అండర్–14, 16, 18, 20 విభాగాలకు సంబంధించి 60 మీ., 100 మీ., 200మీ., 400మీ., 600 మీ., 800మీ., 1,000 మీ., 1,500మీ., 3,000 మీ., 5,000 మీ., 10,000 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, బ్యాక్‌త్రో, షాట్‌పుట్, జావెలిన్ త్రో, హర్డిల్స్, తదితర అంశాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పుట్టి సురేష్‌చందర్, కోచ్‌లు ఆనంద్, సునీల్, సాధి క్అలీ, పీడీలు రమేష్‌బాబు, సి.శ్రీనివాసులు, రాజు, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన భూత్పూర్ మండలం తాటిపర్తి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. భూత్పూర్ మున్సిపాలిటీకి చెందిన కుమ్మరి శివ (35), ఎల్లప్పలు బైక్‌పై జడ్చర్ల నుంచి భూత్పూర్‌కు వస్తుండగా.. తాటిపర్తి శివారులోని జాతీయ రహదారిపై అదుపుతప్పి పక్కనే ఉన్న ఇనుప రేలింగ్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో శివ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్లప్పకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పడంతో మరో వ్యక్తి..

అడ్డాకుల: మండలకేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన సాధిక్ వలీ(27), షేక్‌దాదా వలీ ఇద్దరు కలిసి బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వస్థలానికి బయలుదేరారు. మార్గమధ్యలో అడ్డాకుల దాటిన తర్వాత స్నేహ చికెన్ ఎగుమతుల పరిశ్రమ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు తరలిస్తుండగా సాధిక్ వలీ చనిపోయినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. షేక్‌దాదా వలీ స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


బొల్లె లక్ష్మి(ఫైల్)

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి (38) నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. బొల్లె నాగేష్ అతడి భార్య బొల్లె లక్ష్మి మోటారు సైకిల్‌పై వెనచర్లలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా గ్రామ శ్మశానవాటిక సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. లక్ష్మి కుమారుడు దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

బాలిక బలవన్మరణం


స్ఫూర్తి (ఫైల్)

జడ్చర్ల: పాలమూరు జిల్లా జానపద గాయకుడుగా పేరొందిన కళాకారుడు జంగిరెడ్డి కూతురు స్ఫూర్తి(17) బలవన్మరణానికి పాల్పడింది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో జంగిరెడ్డి భార్య జ్యోతి, కూతురు స్ఫూర్తితో కలిసి నివాసం ఉంటున్నారు. పెద్ద కూతురు స్పందన ఏపీలోని కోవెలకుంట్లలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కూతురు స్ఫూర్తి జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పక్క గదిలో స్ఫూర్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తించిన తల్లి జ్యోతి వెంటనే పోలీసులకు, హైదరాబాద్ వెళ్లిన జంగిరెడ్డికి సమాచారం ఇచ్చింది. స్ఫూర్తి బలవన్మరణానికి పాల్పడిన గది లోపలి గడియ పెట్టుకోకపోవడంతో అనుమానించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు జంగిరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పూడ్చిన మృతదేహానికి రీపోస్టుమార్టం

హన్వాడ: మండలంలోని మునిమోక్షంలో పూడ్చిన మృతదేహానికి గురువారం తహసీల్దార్ కిష్టానాయక్, ఎస్ఐ వెంకటేష్ సమక్షంలో రీపోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన దండు అంజిలయ్య(46) గత జనవరిలో మృతిచెందాడు. అతడి మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ కోర్టులో ప్రైవేటు కేసు నమోదు కావడంతో.. కోర్టు ఆదేశాల మేరకు రీపోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో నిరుద్యోగ యువత కోసం ఈ నెల 5వ తేదీన స్థానిక ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు ప్రైవేట్ కంపెనీల్లో వివిధ రకాల ఉద్యోగాల కోసం జాబ్‌మేళాలో 500 ఉద్యోగాల కోసం మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 99485 68830, 95502 05227 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శక్తిపీఠంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


జోగుళాంబ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఈఓ పురేందర్


ఆలయంలో భక్తుల రద్దీ

- తొలిరోజు శైలపుత్రిగా దర్శనమిచ్చిన జోగుళాంబ అమ్మవారు
- ఆనతి స్వీకరణతో కార్యక్రమాలు మొదలు..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో గురువారం దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అధికారికంగా ఉత్సవాలు ప్రారంభించారు. ఉదయం అర్చకులు అమ్మవారి ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, పట్టు వస్త్రాలతో స్వామివారి ఆలయానికి చేరుకొని ఆనతి స్వీకరణ చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ బలిభేరి తీసుకొని జోగుళాంబ ఆలయానికి చేరుకొని అక్కడ మంగళ ద్రవ్యాలు, దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, మహా కలశస్థాపన, అగ్ని ముఖం చేశారు. అలాగే బ్రహ్మేశ్వర ఉద్యానవనంలో మృత్ సంగ్రహణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ బ్రహ్మేశ్వర ఉద్యానవనంలో పుట్ట మట్టికి పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య యాగశాలకు చేర్చారు. అక్కడ పుట్ట మట్టిని పాలతో శుద్ధిచేసి నవధాన్యాలు వేసి అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంతో శరన్నవరాత్రి ఉత్సవాలకు బీజం వేశామని.. ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని అర్చకులు ప్రార్థించారు. సాయంత్రం చండీహోమాలు ప్రారంభంకాగా.. మరోవైపు నవావరణ, సహస్రనామ అర్చనలు చేశారు. ఆలయం చుట్టూ ఎనిమిది దిక్కుల బలిహరణాలు చేశారు.


ధ్వజారోహణం చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ధ్వజారోహణంలో ఎమ్మెల్యే..

తొలిరోజు ధ్వజారోహణంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. ధ్వజం దగ్గర పూజలు నిర్వహించిన అనంతరం ధ్వజారోహణం చేశారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కూర్చొబెట్టి ఆలయం చుట్టూ భక్తులు ఊరేగించారు.

ప్రముఖులు హాజరు..

తొలిరోజు ప్రధాన న్యాయమూర్తి కుషా, న్యాయమూర్తులు గంట కవిత, పూజిత, ఉదయ్‌నాయక్, కమలాపురం కవిత, మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, గద్వాల ఆర్డీఓ రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి, మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ తదితరులు హాజరయ్యారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

తొలిరోజు శైలపుత్రిగా..

శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు జోగుళాంబ అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించి ఆరాధించారు. ముత్తైదువులకు సువాసిని, బాలికలకు కుమారి పూజలు చేశారు. అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించి ఆరాధించడంతో చేకూరే ప్రయోజనాలను అర్చకులు వివరించారు. ఇదిలా ఉండగా బాలబ్రహ్మేశ్వరస్వామి వారి యాగశాలలో రుద్ర హోమాలు, చండీహోమాలు జరిగాయి.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, నిర్వాహకులు

కోస్గి: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కోస్గిలో రాష్ట్రస్థాయి అండర్– 17 హ్యాండ్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభమైన పోటీలకు ఉమ్మడి 10 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, నాయకులు అన్న కిష్టప్ప, బెజ్జు రాములు, జీహెచ్‌ఎంలు కృష్ణగౌడ్, రామకృష్ణారెడ్డి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

మహబూబ్‌నగర్ జట్ల విజయం..

మొదటి రోజు జరిగిన పోటీల్లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు, బాలుర జట్టు విజయం సాధించి శుభారంభం చేశాయి. నిజామాబాద్ జట్టుపై మహబూబ్‌నగర్ బాలికల జట్టు 15– 3 స్కోర్‌తో విజయం సాధించింది. హైదరాబాద్‌తో జరిగిన పోటీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు 10– 9 స్కోర్‌తో గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో వరంగల్ జట్టు నల్లగొండపై 9– 1 స్కోర్‌తో, పుల్‌బిల్ బాలికల విభాగంలో వరంగల్ జట్టు మెదక్ జట్టుపై 4– 2 స్కోర్‌తో, ఆదిలాబాద్ జట్టు కరీంనగర్ జట్టుపై 8– 6 స్కోర్‌తో విజయం సాధించాయి. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టు ఆదిలాబాద్ జట్టుపై 10– 5 స్కోర్‌తో, మహబూబ్‌నగర్ జట్టు హైదరాబాద్ జట్టుపై 10– 9 స్కోర్‌తో, రంగారెడ్డి జట్టు ఆదిలాబాద్ జట్టుపై 15– 9 స్కోర్‌తో విజయం సాధించాయి. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేష్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు, పెటా అధ్యక్షుడు వెంకటప్ప, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి జియావుద్దీన్, టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసులు, రఫత్, హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాలరాజు, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, స్వప్న, రాధిక, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


పోటీ పడుతున్న బాలుర జట్లు

ఒడిశా టు హైదరాబాద్

- గంజాయి హాష్ ఆయిల్ సరఫరా
- సాధారణ గంజాయి కంటే పది రేట్ల మత్తు కల్గించే డ్రగ్
- రూ. 25 లక్షల విలువ చేసే హాష్ ఆయిల్ సీజ్.. ఇద్దరు యువకుల అరెస్టు
- ఎస్టీఎఫ్ డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న ఎస్టీఎఫ్ డీఎస్పీ శ్రీనివాసరావు

మహబూబ్‌నగర్ క్రైం: రూ. లక్షలు విలువచేసే గంజాయి నుంచి వెలికితీసిన హాష్ ఆయిల్ రవాణాదారులను ఎక్సైజ్ సీ–టీం ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసును మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్టీఎఫ్ డీఎస్పీ టీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఒడిశాకు చెందిన గంజాయి రవాణా దారుడు బోకురూప్ రాయ్ అనే వ్యక్తి వద్ద అదే రాష్ట్రంలోని ఖలీమేలా ఏరియాకు చెందిన నారాక్టమ్ రాయ్, ధర్మేంద్ర రాయ్ అనే ఇద్దరు యువకులు కలిసి రూ. 25 లక్షల విలువచేసే 5 కిలోల గంజాయి హాష్ ఆయిల్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత సదరు ఆయిల్‌ను తీసుకుని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు మార్గమధ్యంలోని మహబూబ్‌నగర్ బైపాస్ వద్ద ఎస్టీఎఫ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వీరు ఒడిశా నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాయచూర్ ప్రాంతాల్లో ఉన్న గంజాయి వినియోగదారులకు హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందని.. అధిక మొత్తంలో ఎండు గంజాయి నుంచి హాష్ ఆయిల్ తయారు చేస్తారని తెలిపారు. చిన్నపాటి పాకెట్లు, డబ్బాలలో ఆయిల్ ప్యాక్ చేసి వినియోగదారులకు విక్రయిస్తుంటారని వెల్లడించారు. సాధారణ గంజాయి కంటే పది రేట్ల మత్తు ఉంటుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఐటీ ప్రొఫెషనల్స్, మెడికల్, ఉన్నత ఉద్యోగులు దీన్ని వాడుతుంటారని తెలిపారు. నారాక్టమ్ రాయ్ అనే వ్యక్తిపై గతేడాది భద్రాచలంలో గంజాయి కేసు నమోదు కాగా.. జైలుకు వెళ్లాడని, 8 నెలల క్రితం విడుదల అయినట్లు తెలిపారు. ఇలాంటి హాష్ ఆయిల్ సరఫరా ముఠా మొదటిసారిగా పట్టుబడ్డారన్నారు. వారి నుంచి హాష్ ఆయిల్‌తో పాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్టీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, ఎస్టీఎఫ్ ఎస్ఐ శివ, ఎస్టీఎఫ్ సిబ్బంది మౌలాలి, శివదాసు, భరత్, లోకేష్ ఉన్నారు.

పీయూ అధ్యాపకుల నూతన ఆవిష్కరణ


ధ్రువపత్రాలు చూపుతున్న అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు నూతన ఆవిష్కరణ సృష్టించారు. ఆస్పత్రుల్లో రోగులకు అందించే ఆక్సిజన్ థెరపీలో మ్యానువల్ విధానంలో ఆక్సిజన్ అందించే విధంగా ఇప్పటి వరకు ఉండేది. వీరు ఆవిష్కరించిన విధానం ద్వారా డిజిటల్ పద్ధతిలో, ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆక్సిజన్‌ను నియంత్రించే అవకాశం ఉంది. 'ఐఓటీ బేస్డ్ పోర్టబుల్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్'ను ఆవిష్కరించారు. దీనికి గాను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా నుంచి డిజైన్ విభాగంలో ఆమోదం లభించింది. అందుకు సంబంధించి ధ్రువపత్రాలను సంస్థ నుంచి అధ్యాపకులు అందుకున్నారు. పీయూ పరిధిలో పనిచేసే మోటూరి మధు, సత్యమ్మ, భారతి ఈ ఆవిష్కరణలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో అర్జున్‌కుమార్, రాఘవేందర్, రవికుమార్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

వనపర్తిటౌన్: వైద్యులు సకాలంలో స్పందించకపోవడంతో శిశువు పురిటిలోనే మృతి చెందిందంటూ గురువారం జిల్లాకేంద్రం శివారులోని ఎంసీహెచ్ ఎదుట బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన అనూష ప్రసవానికి ఎంసీహెచ్‌కు వచ్చింది. గురువారం శస్త్రచికిత్స నిర్వహించగా శిశువు మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. గర్భిణి ఇబ్బందులు పడుతుందని మూడురోజులుగా చెబుతున్నా పట్టించుకోలేదని.. వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో కలెక్టర్ ఆదర్శ్ సురభి శిశువు మృతికి గల కారణాలను ఆర్‌ఎంఓ బంగారయ్యను అడిగి తెలుసుకున్నారు. శిశువు మెడకు పేగు చుట్టుకోవడంతో రక్త ప్రసరణ జరగక మృతి చెందిందని కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని స్త్రీ వైద్య నిపుణురాలు మన్వితను కోరినట్లు తెలుస్తోంది. ఆందోళన తీవ్రతరం కావడంతో ఎస్ఐ జలంధర్ అక్కడకు చేరుకొని బాధితులకు నచ్చజెప్పి విరమింపజేశారు.

డ్యూటీ మీట్.. పోలీస్ నైపుణ్యం పెంచుతుంది

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్


డాగ్ స్క్వాడ్ పోటీలను పరిశీలిస్తున్న డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: డ్యూటీ మీట్‌ల ద్వారా పోలీస్ సిబ్బందిలో మరింత నైపుణ్యం పెరుగుతుందని జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్–2024కు సంబంధించి గురువారం జిల్లా పరేడ్ మైదానంలో నిర్వహించారు. జోనల్ స్థాయికి సంబంధించి పోలీస్ అధికారులు, సిబ్బంది వివిధ విభాగాలలో ప్రత్యేక పోలీస్ విధుల నైపుణ్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ మీట్‌లో కేటగిరి వారీగా పోటీలు నిర్వహించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ ఉద్దేశం పోలీస్ అధికారుల్లో నైపుణ్యాలను మెరుగుపరచడం, వాటి వినియోగాన్ని ప్రోత్సాహించడంతో పాటు క్రైం విచారణ, సైంటిఫిక్ విచారణకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే క్రిమినల్ చట్టం నుంచి తప్పించుకోకుండా ఉపయోగపడుతుందని, దీంట్లో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి మీట్‌కి, ఆ తర్వాత జాతీయస్థాయి మీట్‌కు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి, ఉమ్మడి జిల్లాలోని ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, రామేశ్వర్, రాందాస్ తేజ, రియాజ్ ఉల్‌హక్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సుదర్శన్, నర్సింహులు, నరేందర్‌రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వర్షం.. నష్టం

- మార్కెట్ యార్డులలో తడిసి ముద్దయిన మొక్కజొన్న
- రైతుల కళ్లెదుటే కొట్టుకుపోయిన ధాన్యం
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల వేడుకోలు


బాదేపల్లి మార్కెట్‌లో దోజర్ సహాయంతో మొక్కజొన్నను కుప్ప గడుతున్న రైతులు

అచ్చంపేట రూరల్/జడ్చర్ల/గద్వాల క్రైం/అలంపూర్: ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతన్నలకు అకస్మాత్తుగా కురిసిన వర్షం తీరని నష్టాన్ని మిగిల్చింది. రైతుల కళ్లెదుటే మొక్కజొన్న తడిసిపోవడంతో పాటు కొంతమేర వర్షపునీటిలో కొట్టుకుపోయింది. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం వివిధ గ్రామాల నుంచి 23 మంది రైతులు 418 క్వింటాళ్ల మొక్కజొన్నను అమ్మకానికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం వరకు టెండర్ ప్రక్రియ పూర్తవ్వగా.. గరిష్టంగా రూ. 2,439, కనిష్టంగా రూ. 1,969, సగటున రూ. 2,437 ధరలు వచ్చాయి. ఈ క్రమంలోనే అకస్మాత్తుగా భారీ వర్షం పడటంతో మార్కెట్ యార్డులోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. మార్కెట్ అధికారులు కవర్లు అందించినా ఫలితం లేకపోయింది. సుమారు 200 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం తడిసిపోయిందని అంచనా. అదేవిధంగా మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం కొంతమేర వర్షపునీటిలో కొట్టుకుపోయింది. టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ.. తడిసిన ధాన్యమని వ్యాపారులు కొర్రీలు పెడతారని, ఎలాంటి ఆటంకం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని మార్కెట్ కార్యదర్శి నర్సింహులు తెలిపారు.

■ బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డుకు దాదాపు 6,689 క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో ఇంత భారీగా మొక్కజొన్న రావడం ఇదే మొదటిసారి. యార్డులోని షెడ్లు ధాన్యంతో నిండిపోగా.. యార్డు ఆవరణలో పలువురు రైతులు మొక్కజొన్నను ఆరబోశారు. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ఆరబోసిన మొక్కజొన్న తడిసిపోయింది. దోజర్ సహాయంతో ధాన్యాన్ని ఎత్తే ప్రయత్నం చేసినప్పటికీ.. అడుగు భాగాన ఉన్న ధాన్యాన్ని వరద ముంచెత్తింది. మొక్కజొన్నకు క్వింటా గరిష్టంగా రూ. 2, 499, కనిష్టంగా రూ. 1,371 ధరలు వచ్చాయి. ఆముదాలకు రూ. 4, 848 ధరలు లభించాయి.


అచ్చంపేట మార్కెట్‌లో వర్షపునీటిలో కొట్టుకపోతున్న ధాన్యాన్ని సేకరిస్తున్న రైతు

■ జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఈదురుగాలుల ధాటికి నేలకొరిగాయి. ముఖ్యకూడలిలో విద్యుత్ హైటెన్షన్ వైర్లపై పడగా.. పాత బస్టాండ్ సమీపంలో ఓ మహిళపై భారీ కటౌట్ పడటంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

■ అలంపూర్ చౌరస్తాలోని జాతీయరహదారి ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుపై ఏర్పాటుచేసిన జోగుళాంబ అమ్మవారి శరన్నవ రాత్రి ఉత్సవాల స్వాగతం తోరణం ఈదురుగాలులకు నేలకొరిగింది. స్వాగత తోరణం రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.


వర్షపునీటిలో కొట్టుకుపోతున్న మొక్కజొన్న


అలంపూర్ చౌరస్తాలో నేలకొరిగిన స్వాగత తోరణం


గద్వాల జిల్లా కేంద్రంలో నేలకొరిగిన భారీ కటౌట్

సాంబార్ డీర్‌ను వేటాడిన ఆరుగురు రిమాండ్

మన్ననూర్: నల్లమల అటవీ ప్రాంతంలో సాంబార్ డీర్‌ను వేటాడిన ఆరుగురు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. అమ్రాబాద్ మండలం సార్లపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గత నెల 30న ఆరుగురు వ్యక్తులు ఓ సాంబార్ డీర్‌ను వేటాడారు. వీరిలో కుడి చింతలబైల్ గ్రామానికి చెందిన మండ్లి మల్లేశ్, చిన్నమల్లయ్య, సలీం ఈదయ్య, గోరేటి శ్రీను, సార్లపల్లి గ్రామానికి చెందిన ఆర్తి కొండలు, హైదరాబాద్‌కు చెందిన వరికొప్పుల రమేష్ ఉన్నారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.


పోలీస్‌స్టేషన్ వద్ద నిందితులు

11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు/ ఆత్మకూర్/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో గురువారం స్వల్పంగా పెరిగి.. 75 వేల క్యూసెక్కులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు వద్ద 4 క్రస్టు గేట్ల ద్వారా 28,592 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి నిమిత్తం 38,453, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 720, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 92 క్యూసెక్కులు ఆవిరైంది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 220.267 మి.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 200.344 మి.యూ., విద్యుదుత్పత్తి చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 881.3 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో గురువారం 881.3 అడుగుల వద్ద 195.2102 టీఎంసీల నీరు నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 21,154 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 4,304 మొత్తం 25,458 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు.